క్లుప్తంగా

రక్తదానంపై అవగాహన

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో శనివారం రక్త దాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్త దానంపై అవగాహన సదస్సును నిర్వహించినట్లు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో తెలియజేశారు. ప్రజలకు రక్తం విలువ తెలియాలనే ఉద్దేశ్యంతో ప్రతి ఏడాది కళాశాలలో జూన్ 14న రక్త దాతల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారన్నారు.

బాధితులకు చేయూత



బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందిస్తున్న సభ్యులు

ఏలేశ్వరం: హెల్పింగ్ యూత్ ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం అగ్నిప్రమాద బాధితులకు సహాయం అందజేశారు. ఇటీవల అగ్నిప్రమాదంలో నష్టపోయిన బాధితుడు దెయ్యాల రాజు కుటుంబానికి హెల్పింగ్ యూత్ తరుపున టేబుల్ ఫ్యాన్, వంటసామాన్లు, బియ్యం ,నగదు, నిత్యావసర వస్తువులు ఉచితంగా అందజేశారు. బాధితులకు తమవంతుగా సహాయం అందజేశామన్నారు. కార్యక్రమంలో యూత్‌సభ్యులు మద్దుల స్వరూప్, ఆలీషా, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ



పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న పడాల శ్రీనివాసరెడ్డి

ప్రత్తిపాడు: సదా మీ సేవలో స్వచ్ఛంద సేవా సంస్థ అందిస్తున్న సేవలను పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీ షిర్డిసాయి జ్యూయలరీస్ అధినేత పడాల శ్రీనివాసరెడ్డి కోరారు. ప్రత్తిపాడు బజారు వీధి రామాలయం వద్ద శనివారం ఎస్ఎంఎస్ సంస్థ పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లను శనివారం పంపిణీ చేసింది. ఈకిట్లను సమకూర్చిన పడాల శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. పౌష్టికాహార కిట్లతో పాటు భోజన వసతి కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ ఛాయా చిత్ర అవార్డు గ్రహీత సలాది కృష్ణ, ఎస్ఎంఎస్ ప్రతినిధులు గొందేసి సత్యానందం, కె.జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మెరుగైన ఆరోగ్యం



కాకరాపల్లిలో యోగా చేస్తున్న ఎంపీడీఓ నారాయణ తదితరులు

కోటనందూరు: యోగా చేయడంతో ప్రతి ఒక్కరూ మెరుగైన ఆరోగ్యం సాధించవచ్చని ఎంపీడీఓ వెంకటనారాయణ అన్నారు. ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కోటనందూరు, కాకరాపల్లి, కొత్తకొట్టాం, కేఈ చిన్నయ్యపాలెం, కేపీ మల్లవరం గ్రామాల్లో శనివారం నిర్వహించిన యోగా ట్రైల్ రన్ వేదికలను ఆయన పరిశీలించారు. గ్రామస్తులు, ప్రభుత్వ సిబ్బందితో కలిసి యోగాపై సాధన చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ యోగాను రోజువారీ జీవితంలో ఓ భాగంగా చేసుకోవాలని సూచించారు. యోగా చేయడంతో శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.

తాండవ నదిలో పడి వ్యక్తి మృతి



తాండవ నదిలో శివ మృతదేహం

కోటనందూరు: మండలంలోని తాండవనదిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం..విశాఖ జిల్లా పాతగాజువాకకు చెందిన మున్నాసుల శివ(45) గత రెండేళ్లగా కోటనందూరు పరిసర ప్రాంతాల్లో వృత్తి జీవనం సాగిస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో స్థానిక తాండవనదిలోకి స్నానానికి దిగి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మట్టి తవ్వితే కఠిన చర్యలు

కొత్తపల్లి: మండలం పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ చిన్నారావు అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పొలాలు మెరక పేరుతో మట్టి తవ్వకాలు చేపట్టరాదన్నారు. పొలాలు మెరక చేసుకుంటే పొల్లాల్లోనే తప్ప మట్టిని బయటకు తరలించరాదన్నారు. తీర ప్రాంతాల గ్రామాల్లో అనుమతులు లేకుండా బొండు ఇసుక తవ్వకాలు చేపట్టరాదన్నారు. తవ్వకాలు చేపడితే రెవెన్యూ, పోలీసులకు అధికారులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.

కాసుల వేటలో కూటమి

- రెచ్చిపోతున్న గ్రావెల్, ఇసుక మాఫియాలు
- ఉచితం పేరుతో అధిక ధరలకు విక్రయం
- కూటమి నేతల కనుసన్నల్లో దందా
- నిద్రావస్థలో అధికార యంత్రాంగం



కోటనందూరులో గొంపకొండ వద్ద గ్రావెల్ స్టాక్ పాయింట్

కోటనందూరు: కోటనందూరు మండలంలో గ్రావెల్, ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. రాత్రి, పగలు తేడా లేకుండా రోజూ వందల ట్రాక్టర్ల గ్రావెల్, ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించేస్తున్నారు. ప్రభుత్వ పెద్దల చేస్తున్న 'ఉచితం' ప్రకటనకు పూర్తి విరుద్ధంగా అధిక ధరలకు విక్రయించి మాఫియా గ్యాంగు జేబులు నింపుకుంటున్నారు. కూటమి నేతల కనుసన్నల్లో యథేచ్ఛగా సాగుతున్న ఈ దందా వైపు అధికార యంత్రాంగం కనీసం కన్నెత్తి కూడా చూడడం లేదు. రైతులు తమ పొలంలో మట్టిని ఒక మడి నుంచి మరొక మడికి తరలించుకుంటుంటే అధికార పార్టీ నేతల ఆదేశాలతో అధికారులు చర్యల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ మాఫియా గ్యాంగులకు వత్తాసు పలుకుతున్న అధికారుల తీరుపట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. మాఫియా గ్యాంగు ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి

కోటనందూరులో గొంపకొండతో పాటు ఇండుగపల్లి, కేఓ అగ్రహారం, పాతకొట్టాం, కేఈ చిన్నయ్యపాలెం గ్రామాల్లో గ్రావెల్ కొండలను మాఫియా గ్యాంగు కొల్లగొట్టేస్తున్నారు. గతంలో రూ. 500 వందలు ఉండే గ్రావెల్ ప్రస్తుతం దూరాన్ని బట్టి రూ.700 నుంచి రూ.1000 వరకూ పలుకుతోంది. అడ్డు తగిలే అధికారులకు ఏదో మంత్రాలు వేసి తాము నిర్ణయించిందే ధర అన్నట్టుగా కూటమి నేతలు దందా సాగిస్తున్నారు. మరోప్రక్క కోటనందూరు, కేఓ అగ్రహారం, బొద్దవరం, అల్లిపూడి గ్రామాల్లో తాండవనది పరివాహక ప్రాంతం నుంచి ఇసుకను యధేచ్ఛగా తరలించేస్తున్నారు.



ట్రాక్టర్‌లో తరలిస్తున్న గ్రావెల్



ట్రాక్టర్‌లో తరలిపోతున్న ఇసుక

రైతులపై కేసులు

ప్రభుత్వం అధికారంలోకి వచ్చిననాటి నుంచి కూటమి నేతలను కాదని ఎక్కడైనా గ్రావెల్, ఇసుక, మట్టి తరలింపులు జరిగితే వెంటనే వారిపై కేసుల నమోదు, అపరాదరుసుం విధింపు చకచకా జరిగిపోతున్నాయి. నిజమైన రైతులు తమ పొలంలో మట్టిని ఒక మడి నుంచి మరొక మడికి తరలిస్తుంటే రైతన్నలపై కూటమి నేతల ఒత్తిళ్లతో అధికారులు కేసులు నమోదు చేస్తుండడం గమనార్హం. ఇప్పటికే అనేక గ్రామాల్లో రైతులు, ప్రతిపక్ష నేతలపై అనేక కేసులు నమోదు చేసి సామాన్య ప్రజలను సైతం ఇబ్బందులకు గురి చేసిన సందర్భాలు కోకల్లుగా ఉన్నాయి.

తమ్ముళ్ల కుమ్ములాట

గ్రావెల్, ఇసుక, మట్టి తరలింపులో తమ్ముళ్లు కుమ్ములాడుకుంటున్నారు. ఎవరి ఆధిపత్యం కోసం వారు ఆరాటపడుతూ బాహాబాహీకి దిగుతున్నారు. ఎక్కడికక్కడ కుమ్ములాడుకుంటూ పార్టీ ప్రతిష్టను, ప్రభుత్వ పాలనను రోడ్డుకు ఈడ్చుతున్నారు. తాజాగా కోటనందూరులో ఇద్దరి టీడీపీ నాయకుల మధ్య ఆధిపత్యపోరు మూడు రోజులుగా మరింత ముదిరి ఇసుక తరలింపును నిలిపేసినట్లుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీ పెద్దల జోక్యంతో సమస్య సద్దుమణిగినట్లు తెలుస్తోంది.

రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదు



గ్రావెల్, ఇసుక తరలింపు యధేచ్ఛగా సాగుతున్నా..అడ్డుకట్ట వేయలేని అధికారులు, రైతులు తమ పొలాల్లో మట్టిని ఒక చోటు నుంచి మరొక చోటుకు తరలించుకుటుంటే ఇబ్బందులు పెడుతున్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో మైనింగు, పోలీసు, రెవెన్యూ అధికారులు కేసులు నమోదు చేయడం, అపరాధరుసుం విధించడం, అధికార పార్టీ నేతలను కలవాలని, లేదంటే రైతులను ఇబ్బందులకు గురి చేయడం సరైన విధానం కాదు.

కరక అప్పలనాయుడు,
రైతు, కేఈ చిన్నయ్యపాలెం

కాలినడకన తిరుమలకు



సీతారామ శర్మను సన్మానిస్తున్న భారతీయ ధర్మ పరిషత్ కార్యనిర్వాహక అధ్యక్షుడు

గండేపల్లి: అనకాపల్లి జిల్లా నాతవరం మండలం చిక్కుడుపాలెంకు చెందిన సీతారామ శర్మ హిందూ ధర్మ పరిరక్షణ కోసం తమ గ్రామంలో పాండవ నది దగ్గరలో దేవాలయాలు నిర్మించాలనే సంకల్పంతో తిరుమల వెంకటేశ్వరుడి దర్శనార్థం కాలినడకన వెళ్తున్నట్లు పేర్కొన్నారు. శనివారం గండేపల్లికి చేరుకున్న ఆయనకు భారతీయ ధర్మ పరిషత్ కార్యనిర్వాహక అధ్యక్షులు పాలచర్ల నాగేంద్ర చౌదరి, తదితరులు దుశ్శాలువాకప్పి పూలమాలలతో సన్మానించారు. ఇప్పటికే భూగర్భ శివాలయం నిర్మించినట్టు తెలిపారు. గో సంరక్షణకు అందరూ కృషి చేయాలన్నారు.

కాపు సేవా సమితి మీడియా కన్వీనర్ ఎన్నిక



మీడియా కన్వీనర్‌గా నియమక పత్రాన్ని అందుకుంటున్న శివాజీ

గండేపల్లి: మండలానికి చెందిన ఎస్.శివాజీ కాపు సేవా సమితి రాష్ట్ర మీడియా కన్వీనర్‌గా ఎన్నికైనట్లు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ మేరకు సమితి వ్యవస్థాపక, జాతీయ అధ్యక్షుడు కాలవ వెంకటేశ్వరరావు తనకు నియామక పత్రాన్ని అందించారని తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను మరింత పటిష్ఠ పరచేవిధంగా సంఘం అభివృద్ధికి కృషి చేయనున్నట్టు శివాజీ పేర్కొన్నారు.

ముదునూరి పరామర్శ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన జువ్వల అచ్చారావు ఇటీవల ఆనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని శనివారం వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి కృష్ణంరాజు పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం ఎగ్గొట్టేందుకు కుట్ర

- నిబంధనల పేరుతో కోతలు దారుణం
- ఇచ్చిన హామీలను మర్చిపోయారా

కిర్లంపూడి: ఎన్నికల్లో హామీలు గుప్పించిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని మర్చిపోయారా అంటూ ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ కో–ఆర్డీనేటర్ ముద్రగడ గిరిబాబు ప్రశ్నించారు. హామీ ప్రకారం ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15,000 చొప్పున ఆర్థిక సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఆంక్షల పేరుతో కొన్ని లక్షల మందికి పథకం వర్తింప చేయకుండా మోసం చేస్తున్నారని ఆయన దుయ్యాబట్టారు. తల్లుల ఖాతాల్లో రూ.13,000 వేలు జమ చేశారని మిగిలిన రెండు వేలు ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి జిల్లా కలెక్టర్ ఆధీనంలో ఉండే విధంగా జీవోను అమలు చేశారన్నారు. ఎన్నికల్లో రూ.15,000 ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు రూ.2,000 తగ్గించడం దారుణమన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకం పేరుగా ప్రవేశపెట్టిన పథకాన్ని ప్రస్తుతం తల్లికి వందనం పథకంగా మార్చి, విద్యుత్ వినియోగం, నెలసరి ఆదాయం, మరెన్నో నిబంధనలు పేరుతో ఆంక్షలు విధించి నియోజకవర్గంలో వేలాది మంది అనర్హుల పేర్లు సచివాలయాల్లోని జాబితాల్లో పొందుపర్చటం బాధాకరమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



వైఎస్సార్ సీపీ ఇంచార్జి గిరిబాబు

డెంగీతోనే ప్లేట్‌లెట్స్ తగ్గుదల

శంఖవరం: డెంగీ వ్యాధి కారణంగానే ప్లేట్‌లెట్స్ తగ్గిపోతాయని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు. మండలంలోని కొత్తూరు గ్రామంలో శనివారం ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఏడిస్ దోమ కుట్టడంతోనే డెంగీ వస్తుందని, ఈ దోమ పగటి పూట కుడుతుందన్నారు. వ్యాధికి ప్రత్యేక చికిత్స అంటూ ఏమి లేదని లక్షణాలకనుగుణంగా చికిత్స పొందాలన్నారు. ఒళ్లు నొప్పులు,కాళ్లు లాగడం, వాంతులు, చలితో కూడిన జ్వరం, పళ్లు చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. దోమల నియంత్రణకు దోమల తెరలు, మస్కిటో కాయిల్స్ ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



కొత్తూరులో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు సౌమ్యశ్రీ

కేంద్రమే బాధ్యత వహించాలి

అన్నవరం: అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం ఇన్‌ఛార్జి ముద్రగడ గిరిబాబు ఆదేశాల మేరకు స్థానిక పార్టీ నాయకులు శనివారం సాయంత్రం చినరావిచెట్టు అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించి, కొవ్వొత్తులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఎస్.కుమార్‌రాజా మాట్లాడుతూ ప్రయాణానికి ముందు విమానంలో అన్ని వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అనేది తనిఖీ చేయడంలో తీవ్ర వైఫల్యం కనిపిస్తోందని కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతకాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గం పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు సరమర్ల మధుబాబు, వాణిజ్య విభాగం అధ్యక్షుడు గణేశుల బాబ్జీ, నాయకులు ప్రసాద్, రాయి శ్రీనివాస్, బత్తుల రవికుమార్, సింగంపల్లి రాము, కాంద్రకోట రాజు తదితరులు పాల్గొన్నారు.



విమాన ప్రమాదంలో మృతులకు నివాళులర్పిస్తున్న సర్పంచ్ కుమార్‌రాజా, నాయకులు

రాత్రిళ్లు నిర్మాణం.. పగలు చోద్యం

గండేపల్లి: రాత్రిళ్ల అక్రమ నిర్మాణాలు చేపడుతున్న అధికారులు పగటిపూట చోద్యం చూస్తున్నారు. నిర్మాణం జరుగుతున్న విషయం మాకు తెలియదు అన్నట్టుగా వ్యవహరిస్తున్న వైనమిది. మండలంలోని నీలాద్రిరావుపేట పరిధిలోని గోకవరం రోడ్డులో జగ్గమ్మచెరువును ఆనుకుని ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డుకు అతి సమీపంలో జగ్గంపేటకు చెందిన ఓ ప్రముఖ పారిశ్రామిక వేత్త కంటైనర్ ఏర్పాటుకు అక్రమంగా సిమెంట్ ఇటుకలతో సుమారు రెండు ఎత్తులో నిర్మాణం చేపట్టి దానిపై కంటైనర్‌ను ఏర్పాటు చేసినట్టు అక్కడి స్థానికులు చెబుతున్నారు. దీనిని అదునుగా తీసుకుని కంటైనర్‌కు పక్కనే షెడ్ నిర్మాణాన్ని రాత్రికి రాత్రే పనులు నిర్వహిస్తుండటంతో అధికారులు మాత్రం చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై పంచాయతీ కార్యదర్శి వీరేంద్రను వివరణ కోరగా గతంలో నిర్మాణాన్ని అడ్డుకున్నామని, ఆర్అండ్‌బీ అధికారులకు లిఖితపూర్వకంగా లేఖను పంపించామని తదుపరి చర్యలు వారే తీసుకోవాల్సి ఉందన్నారు.



గోకవరం రోడ్డులో అక్రమ నిర్మాణం, కంటైనర్‌ను ఏర్పాటు చేసిన దృశ్యం

చిక్కుముడి వీడేదెలా..?

ట్రాఫిక్ దిగ్బంధంలో బస్టాండు సెంటరు

కోటనందూరు: స్థానిక బస్టాండు సెంటరు ట్రాఫిక్ దిగ్బంధంలో కొట్టుమిట్టాడుతోంది. ఈ సెంటర్‌లో తరచూ ట్రాఫిక్ స్తంభించి.. ప్రయాణికులతో పాటు, స్థానికుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తుని, నర్సీపట్నం పట్టణాల మధ్య ప్రధాన సెంటర్ ఇది. అనకాపల్లి–కాకినాడ జిల్లాల్లోని సుమారు 50 గ్రామాల ప్రజలు ఈ బస్టాండు కేంద్రంగా ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ సెంటరు నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. బస్టాండు సెంటరులో ట్రాఫిక్ నియంత్రణపై అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆటోవాలాలు అస్తవ్యస్తంగా వాహనాలు నిలపడం, వ్యాపారులు రోడ్డును ఇష్టానుసారం ఆక్రమించడం ట్రాఫిక్ సమస్యను తీవ్రతరం చేస్తున్నాయి. తాత్కాలిక చర్యలతో ఇక్కడి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించడం లేదు. సంబంధిత అధికారులు ట్రాఫిక్ సమస్య మూలాలపై దృష్టి సారించి, శాశ్వత పరిష్కారం చూపాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



కోటనందూరు బస్టాండు సెంటర్‌లో స్తంభించిన ట్రాఫిక్

రోడ్డు పక్కనే అగాధం..

కిర్లంపూడి: స్థానిక ఏనుగు వీధి సెంటర్ నుంచి గెద్దనాపల్లి, వేలంక వెళ్లే దారిలో చిల్లంగి చెరువు వద్ద కల్వర్టు ప్రమాదంగా మారింది. కల్వర్టకు ఒకవైపు ఉన్న రక్షణ గోడ సగ భాగం మాత్రమే ఉండటంతో వాహనచోదకులు ప్రమాదానికి గురయ్యే ఆస్కారం ఉందని స్థానికులు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టుపై రక్షణ గోడ పొడవు పెంచాల్సిందిగా వాహనదారులు కోరుతున్నారు.



చిల్లంగి చెరువు వద్ద ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

తల్లిదండ్రుల చెంతకు యువతి

ప్రత్తిపాడు: యువతి అదృశ్యమైనట్టు ఫిర్యాదు అందిన 12 గంటల్లోపే పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి యువతిని తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సంఘటన ప్రత్తిపాడు మండలంలో శనివారం చోటు చేసుకుంది. ధర్మవరం గ్రామానికి చెందిన యువతి తల్లిదండ్రులు మందలించడంతో ఆగ్రహించి, ఇంటిలో నుంచి పరారైయ్యింది. శుక్రవారం రాత్రి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువతి అదృశ్యమైనట్టు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. స్థానిక సీఐ బి.సూర్య అప్పారావు చొరవ తీసుకుని, ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, విస్తృత గాలింపు చర్యలు చేపట్టారు. యువతి కిర్లంపూడిలో ఉన్నట్టు గుర్తించిన పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని, కౌన్సిలింగ్ నిర్వహించి, ఆమెను తల్లిదండ్రులకు అప్పగించారు.

ప్రమాదాల జంక్షన్



ప్రమాదాలు జరుగుతున్న చిన్నింపేట జంక్షన్

ఏలేశ్వరం: మండలంలోని చిన్నింపేట జంక్షన్ ప్రమాదాలకు నిలయంగా మారింది. జాతీయ రహదారిపై తరచు ప్రమాదాలు జరుగుతున్న అధికారుల్లో ఏ మాత్రం స్పందన లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిత్యం వేలాదిగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సిరిపురం నుంచి వచ్చే వాహనాలు మలుపులు తిరిగేటప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి. బస్టాండు నిర్మించాలని సుమారు నాలుగు గ్రామాల ప్రజలు ఎన్నోఏళ్లుగా కోరుతున్నారు. ప్రమాదాల నివారణకు వీధిదీపాలు ఏర్పాటు, సెక్యూరిటీ గార్డును నియమిస్తామని ప్రకటిస్తున్న అధికారులు తరువాత పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ట్రాఫిక్ నియంత్రణకు బోర్డులు ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకొంటున్నారని, అధికారులు ఇప్పటికైనా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

జగ్గంపేట: జగ్గంపేట శివారు పోలవరం కాలవ గట్టు సమీపంలో రహస్యంగా పేకాట ఆడుతున్న శిబిరంపై జగ్గంపేట ఎస్సై రఘునంధన్‌రావు సిబ్బందితో శనివారం రాత్రి దాడి చేశారు. ఈ తనిఖీల్లో ముగ్గురు పేకాట ఆడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ 10,100 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా చట్టావ్యతిరేక పనులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నవోదయ పేరెంట్స్ నూతన కమిటీ

పెద్దాపురం: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయ పేరెంట్స్ కమిటీ ఎన్నిక శనివారం ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా 450 మంది విద్యార్థుల తల్లిదండ్రులు హాజరు కాగా పేరెంట్స్ కమిటీ ఎన్నికలు నిర్వహించి పదిమంది పేరెంట్స్‌ను ప్రతినిధులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి మాట్లాడుతూ విద్యాలయ అభివృద్ధి, పురోగతికి పేరెంట్స్ సహకారం ఎంతో అవసరమన్నారు. వారిలో నుంచి అందరి ఏకాభిప్రాయంతో పది మంది ప్రతినిధులను ఎన్నుకోన్నారన్నారు. ఈ ఎన్నికలో టి.దుర్గ, ఎం.కిషోర్, ఎస్.ఆదిలక్ష్మి,ఎ.నారాయణ, ఎం.రామలింగేశ్వరరావు, కె.ఉష, శ్రీనివాస్, విష్ణు, పి.శ్రీనివాస్, ఎస్.సూరిబాబు ఎన్నికైనట్లు ఆమె తెలిపారు.కార్యక్రమంలో విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య,సత్యన్నారాయణ, చక్రవర్తి, జగన్మోహనరావు, ప్రేమలత, మధుబాల పాల్గొన్నారు.

శుద్ధి చేసిన తాగునీరు పంపిణీ

గండేపల్లి: మండలంలోని గండేపల్లి గ్రామస్తులకు మైక్రో ఫిల్టర్ బెడ్ ద్వారా తాగునీటిని అందజేసేందుకు చర్యలు చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలియజేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటనలతో తెలిపారు. దీనిక సంబంధించిన ఎస్టిమేట్‌ను తయారుచేశామన్నారు. గ్రామంలో పెద్ద చెరువుకు మళ్లించిన గోదావరి నీటిని మైక్రో ఫిల్టర్ బెడ్ ద్వారా శుద్ధిచేసి గ్రామంలో గల వాటర్ ట్యాంక్‌ల ద్వారా తాగునీటిని ప్రజలకు సౌకర్యార్థం అందజేస్తామన్నారు.